క్లుప్తంగా

ఆర్థిక సహాయం



బాధిత మహిళకు నగదు అందజేస్తున్న ఫ్రెండ్స్ ఫౌండేషన్ సభ్యులు

మెరకముడిదాం: మండలంలోని పులిగుమ్మి గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్యఖర్చుల నిమిత్తం బాధి తురాలికి గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ ఫౌండేషన్ తరపున రూ.48,800 ఆర్థిక సహాయం మంగళవారం అందజేశారు. బాధి తురాలికి తమవంతు ఆర్థిక సహాయం అందించామని, దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని ఫ్రెండ్స్ ఫౌండేషన్ సభ్యులు కోరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు టి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గృహసారథులకు బీమా సౌకర్యం



మాట్లాడుతున్న మండల జేసీఎస్ ఇన్‌చార్జి రఘు

బొండపల్లి: గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నియమించిన గృహసారథులకు పార్టీ ఉచితంగా బీమా సౌకర్యం కల్పిస్తోందని, గృహసారథులు అంతా తమ వివరాలను నమోదు చేయించుకోవాలని మండల జేసీఎస్ ఇన్‌చార్జి పల్లి రఘు సూచించారు. బీమా నమోదుపై వెదురువాడ గ్రామంలో గృహ సారథులకు మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. ఎంపీటీసీ మోపాడ సరస్వతి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.వెంకిరాజు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న గీతాసత్సంగ్ సమితి ప్రతినిధులు, హెచ్ఎం

చీపురుపల్లి: కృష్ణాష్టమి సందర్భంగా గీతాసత్సంగ్ సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని కొత్తగవిడి వీధి గీతామందిరంలో ఈనెల 6న విద్యార్థులకు భగవద్గీతపై శ్లోకపఠన పోటీలు నిర్వహించారు. వంగపల్లిపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు టి.రాంబాబు ప్రథమ స్థానం, ఆర్.కవితశ్రీ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ఆ పాఠశాలలో గీతాసత్సంగ్ సేవా సమితి ప్రతినిధి డాక్టర్ బండారు ప్రకాష్, హెచ్ఎం ఎస్.బలరామ్ మంగళవారం బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఉపాధ్యాయుడు వలిరెడ్డి రవీంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బిందుసేద్యంతో సాగునీరు ఆదా



గోపాలపల్లిలో డ్రిప్ యూనిట్‌ను పరిశీలిస్తున్న పీడీ లక్ష్మీనారాయణ

శృంగవరపుకోట: బిందు, తుంపర సేద్యంతో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగు చేయవచ్చని, సాగునీటిని ఆదా చేయవచ్చని ఏపీ ఎంఐపీ పీడీ పి.ఎన్.వి.లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని గోపాలపల్లి గ్రామంలో రైతు మండజోగి జగన్నాథరావు వ్యవసాయం క్షేత్రంలో అమర్చిన బిందు సేద్యం పరికరాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై బిందు, తుంపర సేద్యం పరికరాలు అందిస్తోందని చెప్పారు. బిందు, తుంపర సేద్యంతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. వీఏఏ వరలక్ష్మి, ఎంఐఏఓ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లోకి గంబూసియా చేప పిల్లల విడుదల



దేవాడ చెరువులో చేప పిల్లలను విడిచిపెడుతున్న వైద్యసిబ్బంది

కొత్తవలస: దోమల నివారణకు మండలంలోని దేవాడ, వియ్యంపేట, ముసిరాం, వీరభద్రపురం, తుమ్మికాపల్లి, నిమ్మలపాలెం గ్రామాల చెరువుల్లో వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యసిబ్బంది 5వేల గంబూసియా చేప పిల్లలను మంగళవారం వదిలిపెట్టారు. ఎంపీహెచ్ఈఓలు నరసింహారావు, తిరుపతిరావు మాట్లాడుతూ సాగునీరు, మంచినీటి చెరువుల్లో దోమల లార్వాలను గంబూషియా చేపలు ఆహారంగా తీసుకుంటాయని, దోమల వృద్ధిని వీటితో అరికట్టవచ్చని చెప్పారు. హెల్త్ అసిస్టెంట్లు సత్యారావు, ఈశ్వరరావు, ఏఎన్ఎంలు లక్ష్మి, జ్యోతి, విజయలక్ష్మి, సత్యవతి, గౌరి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

• ఉత్సాహంగా మండలస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు



లక్కవరపుకోట: ఖోఖో ఆడుతున్న విద్యార్థినులు

మెరకముడిదాం: క్రీడలు మానసిక ఉల్లాసానికి, దేహదారుఢ్యానికి దోహదపడతాయని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి. రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు అన్నారు. గర్భాం ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం నిర్వహించిన మండలస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలను స్థానిక సర్పంచ్ గాబ్రియల్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. ఆటల పోటీల్లో పాల్గొన్న 13 పాఠశాలల విద్యార్థులను నాయకులు అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు ఎస్.ఎస్.ఆర్.ఆచార్యులు, వైస్ ఎంపీపీ టి.హరిబాబు, నాయకులు పప్పల కృష్ణమూర్తి, పలువురు పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

లక్కవరపుకోట: చదువుతో పాటు క్రీడల్లో రాణించే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని స్థానిక మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కిశోర్‌కుమార్ అన్నారు. మోడల్ స్కూల్ మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. గంగుబూడి, కొట్యాడ, ఎల్.కోట, గొల్జాం, కళ్లేపల్లి, చందులూరు ఉన్నత పాఠశా లలతో పాటు మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలల విద్యార్థులు 150 మంది వరకు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ తదితర 11 రకాల ఆటల పోటీలను నిర్వహించారు. మండలస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల కో–ఆర్డినేటర్ పి.వెంకటరావు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు జి.శ్రీనివాసరావు, వి.వెంకటరమణ,గాడి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మెరకముడిదాం: మండల స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

జామిలో..

స్థానిక ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలను మంగళవారం నిర్వహించారు. ఎంపీడీఓ ఎం.సతీష్, ఎంఈఓ జె.జయశ్రీ ఈ పోటీలను ప్రారంభించారు. అండర్–14, 17 విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, షటిల్, త్రోబాల్, లాంగ్ జంప్, హైజంప్ క్రీడల పోటీల్లో మండలంలోని అన్ని పాఠశాలల నుంచి 180 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 92 మందిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశామని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్ తెలిపారు. హెచ్ఎం రెహమాన్ పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

మెంటాడ (గజపతినగరం రూరల్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక సూచించారు. మధుపాడ గ్రామంలోని సాయిగౌతమీ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఎంఈఓ విమల మాట్లాడుతూ పోటీలకు మండలంలోని పది పాఠశాలల నుంచి 450 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ ఎస్.ఎస్.నాయుడు, స్థానిక సర్పంచ్ పైడపునాయుడు, తుమ్మికాపల్లి సర్పంచ్ బెల్లాన త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.



జామి: నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఎంపీడీఓ సతీష్,ఎంఈఓ జయశ్రీ తదితరులు



మెంటాడ (గజపతినగరం రూరల్): పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ జ్ఞానదీపిక

పథకాలకు అర్హతే ప్రామాణికం



వేపాడ: లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న వెంకటచినరామునాయుడు, కస్తూరి

వేపాడ: పార్టీలతో సంబంధం లేకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ పథకాలు మంజూరవుతున్నాయని డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకటచినరాము నాయుడు, కొత్తవలస ఏఎంసీ చైర్‌పర్సన్ మూకల కస్తూరి అన్నారు. నూతనంగా మంజూరైన పింఛన్లను మండలంలోని నీలకంఠరాజపురం సచివాలయంలో సర్పంచ్‌లు గోటివాడ దేవి, రామునాయుడు, ఉపసర్పంచ్ కండిపల్లి పెదనాయుడుతో కలిసి లబ్ధిదారులకు మంగళవారం పంపిణీ చేశారు. నల్లబిల్లిలో ఎంపీడీఓ కూర్మనాథ్ పట్నాయక్, మండల వ్యవసాయ సలహా మండలి కమిటీ చైర్మన్ సన్యాసినాయుడు, గ్రామపెద్ద నాగిరెడ్డి చిరంజీవి పింఛన్లు పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గంట్యాడలో..

గంట్యాడ: మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు ఎంపీపీ పీరుబండి హైమావతి, జెడ్పీటీసీ వర్రి నర్సింహమూర్తి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీఓ భానోజీరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి లబ్ధిదారులను తీసుకురావాలని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లకు సూచించారు.

పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి



ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ శ్రీధర్‌రాజా

చీపురుపల్లి: పట్టణంలో పారిశుద్ధ్య పనులను కార్మికులు సక్రమంగా నిర్వహించేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) ఎల్.శ్రీధర్‌రాజా అన్నారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధి జి.అగ్రహారం, రిక్షాకాలనీ, కొత్తఅగ్రహారం, లావేరురోడ్ తదితర ప్రాంతాలను, లావేరురోడ్‌లోని చెత్తశుద్ధి నిర్వహణ కేంద్రం (ఎస్‌డబ్ల్యూపీసీ)ని మంగళవారం ఆయన సందర్శించారు. వీధి కాలువలు, రోడ్లను పరిశీలించారు. ఎస్‌డబ్ల్యూపీసీ నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన చెత్త సేకరణ బుట్టలను ప్రతీ ఇంటికి రెండు చొప్పున పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ అన్నపూర్ణాదేవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ ఎస్.రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

కొత్తవలస: మండల కేంద్రంలో రాజకీయపార్టీలు, వ్యాపార సంస్థలు, ఇతరులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకునేందుకు కొత్తవలస మేజర్ పంచాయతీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసిందని సర్పంచ్ మచ్చ ఎర్రరామస్వామి తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సాధారణ సమావేశం మంగళవారం నిర్వహించారు. కొత్తవలస జంక్షన్‌లో ఆక్రమణలను,విజయగనరం రోడ్డులోని శ్మశాన వాటిక వద్ద ఆక్రమణలను తొలగించేందుకు తీర్మానాలు చేశారు. ఉప సర్పంచ్ పెనగంటి మంగవేణి, వైస్ ఎంపీపీ కర్రి శ్రీను,పంచాయతీ సిబ్బంది పటాన్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నాగమణి

గంట్యాడ: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.నాగమణి అన్నారు. మండలంలోని నరవ గ్రామ సచివాలయంలో మంగళవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థ అందించే సేవలతో పాటు చట్టాలపై అవగాహన కల్పించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయసేవలు, సలహాలు పొందవచ్చన్నారు. వృద్ధులు, పిల్లలకు న్యాయ సేవాధికారి సంస్థ అండగా ఉంటుందని తెలిపారు. న్యాయ సేవాధికారి సంస్థ అందించే ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలన్నారు. తహసీల్దార్ కె.స్వర్ణకుమార్, ఎంపీడీఓ భానోజీరావు, నరవ సర్పంచ్ పతివాడ భాస్కరరావు, నందాం సర్పంచ్ బి.సత్యనారాయణ, ఏఎస్ఐ పి. రాంబాబు, సచివాలయ కార్యదర్శి ఆర్. శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమం



ఎమ్మెల్యే కడుబండిని సత్కరిస్తున్న ఎస్టీకమిషన్ సభ్యురాలు రామలక్ష్మి

• 'గడప గడపకు మనప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: గడప గడపకూ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. ఎస్.కోట మేజర్ పంచాయతీలోని సచివాలయం–2 పరిధిలోని గాంధీనగర్‌లో మంగళవారం 'గడప గడపకు మనప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో కలిసి ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల ద్వారా ప్రతీ కుటుంబానికి కలిగిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తమని ఆదేశించారని చెప్పారు. ఎస్టీకమిషన్ సభ్యురాలు కె.రామలక్ష్మి ఎమ్మెల్యేను శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, స్టేట్‌డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, ఏఎంసీ డైరెక్టర్ పార్వతి, సర్పంచ్‌లు కె.వెంకటరావు, మంచిన శివకోటి, వార్డు సభ్యులు మజ్జి శేఖర్, కె.భారతి, కె.ఈశ్వరి, రంధి అనంత్, ఎంపీటీసీ పి.ధర్మారావు, రామకృష్ణ, ఆవాల కృష్ణ, ఎస్.గణేష్, అప్పలసత్యం, మోపాడ కోటి, ఉల్లి శంకర్, రమణ, పైడితల్లి, అవతారం, మమ్ములూరి సోంబాబు, కె.భాస్కరరావు, నిరుజోగి శ్రీను, శేఖర్, ఎం.రమణ, జి.సన్యాసప్పడు, నాగరాజు, దుర్గాప్రసాద్, ఈశ్వరనాయుడు, కె.జయశంకర్, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కొట్యాడలలో నేత్రవైద్య శిబిరం



లక్కవరపుకోట: వృద్ధుడికి నేత్రపరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్

లక్కవరపుకోట: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొట్యాడ గ్రామంలో విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆప్తాలమిక్ ఎస్.రత్నరాజు శిబిరంలో 90 మందికి నేత్రపరీక్షలు చేశారు. వీరిలో 35 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. శంకర్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ కె.బంగార్రాజు, క్యాంప్ కో–ఆర్డినేటర్ అప్పల రాజు మాట్లాడుతూ ఎంపిక చేసిన వారికి శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేసి మందులు, కళ్లద్దాలు అందజేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కొట్యాడ మహేష్, కొట్యాడ జగన్, కరెడ్ల దేముడు తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరంలో..

మెంటాడ(గజపతినగరం రూరల్): గజపతినగరంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. ఆప్తాలమిక్ రామకృష్ణ 82 మందికి నేత్ర పరీక్షలు చేసి 32 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారని శిబిరం నిర్వాహకుడు పూసర్ల మోహన్ తెలిపారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు సాయిరాం మాస్టారు, ఉప్పల ఈశ్వరరావు, వల్లంటి కృష్ణ పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను విజయవంతం చేద్దాం



వేపాడ: వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ధరణి



బొండపల్లి: సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్

వేపాడ: గ్రామాల్లో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు సంయుక్తంగా విజయవంతం చేయాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ధరణి కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఆశ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 30వ తేదీ వరకు ప్రజారోగ్యంపై ఇంటింట సర్వే చేసి, ప్రజల ఆరోగ్య సమాచారం ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు ఉన్న వారి పేరిట టోకెన్ జనరేట్ చేయాలని చెప్పారు. వీరందరికీ సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 30 వరకు గ్రామాల్లో నిర్వహించనున్న వైద్యశిబిరాలకు తరలించి వైద్యపరీక్షలు చేయించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మెరుగైన వైద్యసేవలు అవసరమైన వారిని ఆస్పత్రులకు రిఫర్ చేయాలని సూచించారు. సుగర్, క్యాన్సర్, గుండె, కిడ్నీ సంబంధిత తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడేవారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సి ఉందన్నారు. ఎంపీడీఓ కూర్మనాథ్ పట్నాయక్, సీహెచ్ఓ ఆంజనేయులు, హెచ్ఎస్ రమణ పాల్గొన్నారు.

పక్కాగా నిర్వహించాలి

బొండపల్లి: మండలంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్ సూచించారు. మండలంలోని ముద్దూరు గ్రామంలో సచివాలయ ఉద్యోగులు,వలంటీర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి 29 వరకు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలు సేకరించాలని చెప్పారు. ఈనెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 30వ తేదీ వరకు ప్రతీ సచివాలయం పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని, దీనిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సర్పంచ్ మునకాల పైడిపునాయుడు పాల్గొన్నారు.

షెడ్యూల్ ఖరారు

జామి: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఈనెల 30 నుంచి అక్టోబర్ 25 వరకు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.సతీష్ మంగళవారం తెలిపారు. వైద్య శిబిరాల ఏర్పాటుకు ముందు గ్రామాల్లో ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకు ప్రజారోగ్యంపై వైద్యసిబ్బంది ఇంటింట సర్వే నిర్వహిస్తారని చెప్పారు. సర్వే అనంతరం 30వ తేదీన విజినిగిరి, అక్టోబర్ 3న అట్టాడ, 4న లక్ష్మీపురం,5న అలమండ సచివాలయం–2 పరిధిలో, 6న జాగరం, 7న ఎం.కె.వలస, 9న వి.ఆర్.పాలెం, 10న లొట్లపల్లి, 11న చింతాడ, 12న ఎ.ఆర్.పేట,13న వెన్నె, 16న కుమరాం,17న తాండ్రంగి,18న భీమసింగి, 19న ఆర్.బి.పురం, 20న కలగాడ, 21,22 తేదీల్లో జామిలో వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రజారోగ్య సంరక్షణే లక్ష్యం

చీపురుపల్లి: ప్రజారోగ్య సంరక్షణే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు మంగళవారం తెలిపారు. మండలంలో ఈనెల 30 నుంచి అక్టోబర్ 21 వరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు.వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలు సేకరించాలని పేర్కొన్నారు. ఆరోగ్య సమస్యలున్న వారిని షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో నిర్వహించే వైద్యశిబిరాలకు తరలించి వైద్యం అందేలా చూడాల్సి ఉంటుందన్నారు.

సంక్షిప్తంగా...

నేడు హుండీల లెక్కింపు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో బుధవారం హుండీల లెక్కింపు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈఓ జి.శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపా రు. ఉదయం 10 గంటలకు దేవస్థానం ఆవరణలో హుండీల లెక్కింపు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

నేడు ఎస్.కోటలో మెగా వైద్యశిబిరం

శృంగవరపుకోట: స్థానిక గొల్లవీధిలో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ ట్రస్ట్ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్ఆర్ఐ ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వైద్యులు సేవలందిస్తారని పేర్కొన్నారు.

లింగంపేటలో పశువైద్య శిబిరం

లక్కవరపుకోట: లింగంపేట గ్రామంలో ఎల్.కోట పశువైద్యకేంద్రం వైద్యాధికారి కె.గాయత్రీదేవి ఆధ్వర్యంలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. 40 పశువులకు వైద్యసేవలందించారు. వర్షాకాలంలో పశువులకు వ్యాధులు సోకే అవకాశం ఉందని రైతులు అప్రమత్తంగా ఉండాలని చూచించారు. పశుగ్రాసం పెంపకానికి పాడిరైతులకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా సహకారం అందిస్తోందని చెప్పారు.

పాఠశాలకు సేఫ్టీ గ్రిల్స్ అందజేత

లక్కవరపుకోట: మండలంలోని కొట్యాడ ఉన్నత పాఠశాలకు విశాఖపట్నానికి చెందిన కె.బుచ్చిరాజు, వెంకటపతిరాజుల జ్ఞాపకార్థం వారి కుమారుడు బంగార్రాజు సేఫ్టీ గ్రిల్స్ అందజేశారు. వీటిని తరగతి గదుల సముదాయం ముఖద్వారం వద్ద మంగళవారం అమర్చారు. సుమారు రూ.50 వేలతో వీటిని తయారు చేయించినట్లు దాత తెలిపారు. హెచ్ఎం బి.పద్మావతి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గర్భిణులకు ఉచితంగా భోజనం

జామి: స్థానిక పీహెచ్‌సీలో వైద్యపరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన గర్భిణులు, వారి సహాయకులు సుమారు 100 మందికి విశ్రాంత హెచ్ఎం చలుమూరి సత్యనారాయణ మంగళవారం ఉచితంగా భోజనాలు అందజేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి వనజ దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

న్యాయం చేయండి

వేపాడ: డీపట్టాల రెగ్యులరైజేషన్‌కు సంబంధించి తమకు న్యాయం చేయాలని మండలంలోని వీలుపర్తి గ్రామ రెవెన్యూకు చెందిన పలువురు రైతులు కోరారు. గ్రామంలో రైతులు మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు గోకేడ నాగభూషణం, శానాపతి అప్పారావు, గండిపడాల జోజిబాబు,రమణ మాట్లాడుతూ ప్రభుత్వం తమ గ్రామంలో గతంలో 102 మందికి సుమారు 80 ఎకరాలకు భూమికి డీపట్టాలు ఇచ్చిందని చెప్పారు. అయితే వీఆర్ఓ, సచివాలయ సర్వేయర్ తీసుకువచ్చి డీపట్టాల రెగ్యులరైజేషన్ జాబితాలో సుమారు 48.22 ఎకరాలకు సంబంధించి 33 మంది పేర్లే ఉన్నాయని, మిగిలిన రైతులు పేర్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. సమస్యను తహసీల్దార్ ప్రసన్నకుమార్ వద్ద సాక్షి ప్రస్తావించగా.. విడతలవారీగా జాబితా వస్తుందని, మొదటి విడతలో వచ్చిన వారి వివరాలను పరిశీలిస్తున్నట్లు తహసీల్దార్ చెప్పారు.

బహుళ పంటల సాగుతో అధిక ఆదాయం

వేపాడ: ప్రకృతి వ్యవసాయ విధానంలో బహుళ పంటలను సాగుచేయడం వల్ల అధిక ఆదాయం సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం మండల యాంకర్ సన్యాసమ్మ చెప్పారు. మండలంలోని కుమ్మపల్లి గ్రామంలో రైతులకు బహుళ పంటల సాగుపై మంగళవారం అవగాహన కల్పించారు. రైతు దాసరి సన్యాసి నాయుడుకు చెందిన 20 సెంట్ల భూమిలో బెడ్‌లు ఏర్పాటు చేసి దుంపజాతి, ఆకుకూరలు, కూరగాయలు, తీగజాతి, పప్పుజాతి పంటల విత్తనాలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బహుళ పంటల సాగుతో ఎనీ టైమ్ మనీ సంపాదించేలా జిల్లాలో రైతులను చైతన్యవంతం చేస్తున్నట్లు చెప్పారు.

రాణించిన గొట్లాం విద్యార్థులు

బొండపల్లి: మండలంలోని గొట్లాం జిల్లా పరిషత్ ప్రభుత్వ హైస్కూల్‌లో చదువుతున్న నలు గురు విద్యార్థులు నెల్లూరులో ఈ నెల 8 నుంచి 10వ తేదీవరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో రాణించారు. విజయనగరం జట్టును ద్వితీయ స్థానంలో నిలిపారు. ఆటలో రాణించిన బి.హరి, టి.అనిల్, ఎం.దుర్గాప్రసాద్, పి.వెంకటస్వామిని హెచ్ఎం జి. సతారామమూర్తి, పీడీ యు.సత్యానంద్, ఉపాధ్యాయులు పాఠశాలలో మంగళవారం అభినందించారు. మరిన్ని పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు.



రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు